
సమావేశంలో మాట్లాడుతున్న అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి

మీ సేవ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

● అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి

అంబర్‌పేట, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మీ సేవ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి సూచించారు. గురువారం అంబర్‌పేట మండలం కార్యాలయంలో మీ సేవ నిర్వాహకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీ సేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను వినియోగదారుల వద్ద తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుల దరఖాస్తు పూర్తిగా నింపాలని, అవసరమైన ధ్రువపత్రాలను ఫామ్‌తో పాటు పెట్టాలన్నారు. దరఖాస్తు పత్రాలను సరిగ్గా స్కానింగ్ చేసి మీ సేవ కేంద్ర నిర్వాహకులు స్వయంగా ఆఫీసులో అందజేయాలన్నారు. దరఖాస్తులలో ఎలాంటి పైరవీలు లేకుండా సాధ్యమైన త్వరగా వారి ధ్రువపత్రాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

పార్కుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని పార్కుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. కోట్ల రూపాయలతో పార్కులలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం నల్లకుంట డివిజన్‌లోని నరేంద్రపార్కులో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. నరేంద్ర పార్కులో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ దివ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, కాంట్రాక్టర్ హుస్సేన్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

అంబర్‌పేట, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట ఎంసీహెచ్ గ్రౌండ్‌లో ఐఎంసీటీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక జీవనంలో ఇబ్బందులకు గురయ్యే వారికి యోగా చేయడం ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సంఘం జేఏసీ ఏర్పాటు

చిక్కడపల్లి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): న్యూ ఢిల్లీలో జరుగుతున్న జాతీయ వినియోగదారుల సంఘం సమావేశాల్లో తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన నూతన జేఏసీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ నెల 18న ప్రారంభమైన సమావేశాలు గురువారం ముగిశాయి. గురువారం నూతన జేఏసీని ఏర్పాటు చేసుకున్నట్లు వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి వివరించారు. 9 మందితో ఈ కమిటీ ఏర్పాటైంది. వీరిలో సాంబరాజు చక్రపాణి(హైదరాబాద్), శంకర్‌లాల్ చౌరాసియా(హైదరాబాద్), మొగిలిచర్ల సుదర్శన్(వరంగల్), సందు ప్రవీణ్(నిజామాబాద్), పి. రాజారెడ్డి(తిరుపతి), పసుపులేటి కార్తీక్(ఒంగోలు), అడుపరెడ్డి గోవిందరావు(విశాఖపట్నం), మామిడి శాంతదేవ్‌మిత్రా(ఎల్‌బీనగర్), ఎస్ ఆదిత్యకిరణ్(కోనసీమ)లతో కమిటీ ఏర్పాటైంది. త్వరలో ఈ కమిటీ రెండు రాష్ట్రాల్లో పర్యటిస్తుందని చక్రపాణి వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వినియోగదారుల ఉద్యమం పటిష్టం చేయడంతోపాటు సభ్యత్వ నమోదు ముమ్మరం చేస్తామని వివరించారు.

రౌడీషీటర్లు ఎలాంటి కేసుల్లో తలదూర్చొద్దు

● ఇన్‌స్పెక్టర్ సీతయ్య



రౌడీ షీటర్, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్

చిక్కడపల్లి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు ఎలాంటి కేసుల్లో తలదూర్చవద్దని అలా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని నాగమయ్యకుంటకు చెందిన అనిల్‌ను అతని కుటుంబ సభ్యులను గురువారం స్టేషన్‌కు పిలిపించిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అతని కుటుంబ సభ్యులకు కూడా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నవారు పలు అసాంఘిక, అక్రమ కార్యకలాపాల్లో తలదూరుస్తున్నట్లుగా తమకు సమాచారం అందుతోందని అలాంటివారిపై ఎంతటి ఒత్తిడి ఉన్నా ఉపేక్షించమని చట్టప్రకారం చర్యలు తీసుకుని శిక్షిస్తామని హెచ్చరించారు.

మేన బావ ప్రేమించడం లేదని యువతి ఆత్మహత్య

బర్కత్‌పుర, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మేనబావ ప్రేమించడం లేదని ఓ యువతి తీవ్ర మనస్తాపానికి గురై అనస్తీయా తీసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కాచిగూడ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోనగండ్లకి చెందిన రమా(23) కొండాపూర్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తూ హాస్టల్‌లో ఉంటుంది. కొంతకాలంగా మేన బావను ప్రేమిస్తుంది. అతడు ఆమె ప్రేమను అంగీకరించలేదు. గురువారం రాత్రి కాచిగూడలో నర్సుగా పనిచేస్తున్న సోదరి వద్దకు వచ్చింది. సోదరి ఉంటున్న హాస్టల్‌కు వెళ్లి అనస్తీయా తీసుకుంది. దీంతో కోమాలోకి వెళ్లి మృతి చెందింది. పోలీసులు రమా మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఎస్‌బీఐ ఆఫీస్ బాయ్ ఆత్మహత్య

బర్కత్‌పుర జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఎస్‌బీఐ ఆఫీస్ బాయ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్ కుమార్ వివరాల తెలిపిన ప్రకారం.. సుందర్‌నగర్‌లో నివాసముంటున్న ఆర్ మహేష్(35) ఎస్‌బీఐ బ్యాంకులో ఆఫీస్ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి వివాహమైంది. ఆర్థిక ఇబ్బందులతో అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక ఇబ్బందులు పడుతున్నాడు. ఇటీవల భార్య ఆరోగ్యం బాగాలేక పుట్టింటికి వెళ్లింది. గురువారం రాత్రి ఇంట్లో సిమెంట్ స్లాబ్ ఉక్కుకు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి పక్కనే నివసిస్తున్న తమ్ముడు శివకుమార్ తలుపు కొట్టినా మహేష్ ఎంతకు తీయలేదు. దీంతో తలుపు పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న కాచిగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మహేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడిపై కేసు

బర్కత్‌పుర, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఫలక్‌నామాకు చెందిన ఓ యువతి చిక్కడపల్లిలోని హాస్టల్‌లో ఉంటుంది. లక్డీకాపూల్‌లో నివాసం ఉంటున్న విశాల్(27) ప్రైవేట్ ఉద్యోగి. వీరిద్దరు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. విశాల్ తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేసి మరోక యువతిని పెళ్లి చేసుకున్నాడని, తనపై అత్యాచారానికి కూడా పాల్పడ్డాడని ఆ యువతి కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. విశాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని చనిపోయిన వ్యక్తి కైసర్‌గా గుర్తింపు

బర్కత్‌పుర, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): యాకత్‌పుర-ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల నడుమ పట్టాలు దాటుతూ రైలు ఢీకొని చనిపోయిన వ్యక్తి సంతోష్‌నగర్‌కు చెందిన కైసర్‌గా గుర్తించినట్లు కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపారు. తండ్రి సోహేల్‌తో కలిసి కైసర్ క్యాటరింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తన కుమారుడిని హత్య చేసి రైలు పట్టాలపై పడేశారని కైసర్ తండ్రి సోహేల్ ఆరోపిస్తున్నారు. భవానీనగర్‌కు చెందిన ఓ వ్యక్తికి సంబంధించిన ఆవులను బక్రీద్ పండగ రోజు పోలీసులు పట్టుకోవడంతో ఆ వ్యక్తి తమ కుమారుడిపై కక్ష పెంచుకుని హత్య చేసి రైలు పట్టాలపై పడేశాడని ఆయన ఆరోపించారు. కైసర్ తండ్రి తమకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని సీఐ ఎల్లప్ప తెలిపారు.


విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


విద్యార్థికి నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్


గోల్నాక తులసీరాంనగర్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకుని గురువారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఒక సంవత్సరం నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

● పిల్లలకు చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పిస్తే ఆనందకర బాల్యాన్ని పొందుతారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. గగన్‌మహల్‌లోని హెల్త్ సెంటర్‌లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి పంపిణీ చేశారు.

● విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయంపై అవగాహనతో ఉండాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట పోలీస్ బాయిస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.


ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, వైద్యాధికారి దీప్తి ప్రియాంక


రంగానగర్‌లో చిన్నారులకు మాత్రలు వేసిన మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్


నల్లకుంటలోని పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న కార్పొరేటర్ అమృత, డాక్టర్ దీప్తి


నింబోలిఅడ్డ లాల్‌బహదూర్ హైస్కూల్‌లో మాత్రలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

విద్యార్థుల బస్ రూట్లలో ఆర్టీసీ స్పెషల్ డ్రైవ్

● రద్దీ సమయంలో అధికారుల తనిఖీలు

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రయాణాలు చేసే బస్ రూట్లలో ఆర్టీసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. విద్యాసంస్థల ప్రారంభం నేపథ్యంలో పీక్ సమయాల్లో ఉదయం, సాయంత్రం మహిళా ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో ఫుట్‌బోర్డు ప్రయాణాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు బస్సు రన్నింగ్‌లో ఉన్నప్పుడు ఎవరూ ఎక్కకుండా చర్యలు చేపడుతున్నారు. బోయిన్‌పల్లి- బాలానగర్- గండి మైసమ్మ రూట్/సికింద్రాబాద్-ఉప్పల్-ఘట్‌కేసర్ రూట్లలో ఆర్టీసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. బస్సుల్లో రోజువారీ ప్రయాణాలు సాగించే విద్యార్థులు అధికారుల సూచనలు పాటించడంతో పాటు జాగ్రత్తగా ప్రయాణాలు చేయాలని సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ ఖుస్రో షా ఖాన్ తెలిపారు.



సోమాజిగూడలోని రాజ్‌భవన్‌లో పశ్చిమబెంగాల్ ఆవిర్భావ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు

మత్తులో ఉన్న ఇద్దరు యువకుల అరెస్ట్

● వారి నుంచి సిరంజీలు, మత్తు పదార్థాలు స్వాధీనం


పోలీసులు అదుపులోకి తీసుకున్న యువకులు

బంజారాహిల్స్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మత్తుకు అలవాటు పడ్డారు...ఉన్న ఊర్లో పని చేస్తే వచ్చే డబ్బు సరిపోక నగరానికి వలసొచ్చారు. ఉద్యోగం చేజారిపోయింది. దీంతో ఇద్దరు నాలుగు రోజులుగా కేబీఆర్ పార్క్ వాక్‌వేలో ఉన్న బండరాయి కింద తల దాచుకుని మత్తు తీసుకుంటూ ఇంటర్ సెప్టర్ ఫూట్ పోలీసులకు దొరికారు. వారి నుంచి మత్తు పదార్థాలు, సిరంజీలను స్వాధీనం చేసుకున్నారు. త్రిపురకు చెందిని బుబాకిసింగ్(23), మణిపూర్‌కు చెందిన వికాస్(25) మత్తుకు బానిసయ్యారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెకడానికి నగరానికి వలస వచ్చి ఫిలింనగర్‌లో ఓ కంపెనీలో సెక్యూరిటీ గార్డులుగా చేరారు. అలవాట్ల కారణంగా యాజమాన్యం వారిని వారం క్రితం తొలగించింది. దీంతో ఇద్దరు జూబ్లీహిల్స్ రోడ్ 45 వైపు పార్క్ బండ కింద నాలుగు రోజులుగా తలదాచుకున్నారు. అన్నపానీయాలు లేకుండా అక్కడే పడుకుంటున్నారు. గురువారం సాయంత్రం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శ్రీనాథ్, దినేష్ వీరిని గమనించారు. మత్తులో ఉండి, నడవడానికి వీలు లేకుండా ఉన్నారు. అక్కడ వెతకగా కొని ఇంజెక్షన్లు, సిరంజీలు, తెల్లటి పొడి, కొన్ని మత్తు మాత్రలు కనిపించాయి. చేతులపై ఇంజెక్షన్‌లు తీసుకున్నట్లు ఆనవాలు దొరికాయి. దీంతో వారిని బంజారాహిల్స్ శాంతి భద్రతల పోలీసులకు అప్పగించారు. కాగా మత్తు కలిగించే మాత్రలను ఆన్ లైన్‌లో కొనుగోలు చేసినట్టు తేలింది. అంతేకాకుండా ఓ వ్యక్తి కూడా రోజూ వచ్చి సిరంజి, కొన్ని కవర్‌లు ఇచ్చేవాడని తెలిసింది. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

కవాడిగూడ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పలువురు ఆరోపించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రూప్ 2, 3లలో ఐదు వేల పోస్టులు, డీఎస్సీలో 25వేల టీచర్లపోస్టులను భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, అశోక్, అన్వర్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, ఎస్సీఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ బక్క జడ్సన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలు మండలాలు, మునిసిపాలిటీలకు అవసరమైన పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

వర్షం నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలి

రాంనగర్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో వర్షం నీరు నిలవకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి సూచించారు. గురువారం డివిజన్‌లోని వైభవ్‌నగర్, శాంతినగర్, సాయిమధురనగర్‌లో వర్షం పడితే నీరు నిలిచి ఉండే ప్రాంతాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షం పడినప్పుడు కాలనీ, బస్తీలలో నీరు నిలిచిపోయి ప్రజలకు ఇబ్బందులకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్‌కు సూచించారు. వర్షా కాలంలో వైభవ్‌నగర్, శాంతినగర్, సాయిమధురనగర్‌లో అధికంగా వర్షం నీరు నిలిచిపోయి ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారని అన్నారు. ఏఈ సురేష్ మాట్లాడుతూ వర్షం నీటి సమస్య సత్వరం పరిష్కరిస్తామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు పేర్రాజు, ప్రవీణ్, సరిత, రేణుక, సునీల్, ప్రసాద్, రవినాయక్, బీఆర్ఎస్ నాయకులు చంద్రమోహన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షలలో అక్రమాలపై విచారణ జరిపించాలి

● తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రామకృష్ణ

రాంనగర్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షలు రద్దు చేసి తిరిగి నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని, నీట్ పరీక్షలలో జరిగిన అవినీతి, అక్రమాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లో నీట్ అభ్యర్థుల ఆధ్వర్యంలో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నీట్ పరీక్ష రద్దు చేయాలని దేశవ్యాప్తంగా నెలకొన్న ఉద్యమాలు, ఆందోళన నేపథ్యంలో ప్రధాని మోదీ వెంటనే నీట్ పరీక్షను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ తాజాగా రద్దు చేసిన యూజీసీ నెట్ 2024 రద్దయింది కానీ వైద్య విద్యార్థులకు సంబంధించి నీట్ రద్దు కాలేదని, దీనిపై విద్యార్థులు క్లారిటీతో ఉండాలని సూచించారు. సమావేశంలో నీట్ అభ్యర్థులు రాజేష్, ప్రవీణ్, అనిల్, సురేష్, వేణు, జగదీష్, నవదీప్ పాల్గొన్నారు.

తలసాని శంకర్‌యాదవ్‌కు ప్రముఖుల నివాళి


శంకర్‌యాదవ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కేటీఆర్, హరీష్‌రావు, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు


శంకర్‌యాదవ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు

రెజిమెంటల్‌బజార్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షులు శంకర్‌యాదవ్ దశదిన కర్మకు పలువురు ప్రముఖులు హాజరై నివాళ్లు అర్పించారు. గురువారం సికింద్రాబాద్ ఎస్‌వీఐటీ అడిటోరియంలో శంకర్‌యాదవ్ దశదిన కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, లక్ష్మణ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, మహమూద్ అలీ, మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, జోగు రామన్న, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, సుధీర్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌రావు, బల్మూరి వెంకట్, సురభివాణిదేవి, మధుసూదనాచారి, ఎగ్గె మల్లేశం, బండ ప్రకాశ్‌ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్‌లు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు బోయిన్‌పల్లి, మోండా మార్కెట్‌లకు చెందిన వర్తకులు, హమాలీ కార్మికులు తదితరులు శంకర్‌యాదవ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.


సన్మానం పొందిన దంపతులతో రామకృష్ణ తదితరులు

గానసభలో 'సప్తపదిలో తోడూనీడ'

చిక్కడపల్లి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్త అన్యోన్యంగా కలిసి ఉన్నప్పుడే సంసారం ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగుతుందని దక్షిణమధ్య రైల్వే పూర్వ జీఎం సి. రామకృష్ణ అన్నారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో 'సప్తపదిలో తోడూ నీడ' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ వివాహ వ్యవస్థ విజయానికి, దాంపత్య జీవనం సరిగ్గా నడవడానికి పరస్పర అవగాహన అవసరమన్నారు. దాంపత్యజీవితంలో కలహాలను దాటుకుని వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన దంపతులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖులు కుసుమ భోగరాజు, చిల్లా రాజశేఖర్ రెడ్డి, కృష్ణమాచార్యులు, వసంతరాయలు, సుబ్బారావు, జి.వెంకటరెడ్డి, నీరజ, నాగవర్ధని, విశ్వనాథ్, సూర్యకామేశ్వరరావు, శైలజ, తిరుమలేశ్వరరావు, రాజేశ్వరి, కృష్ణమోహన్, సునీత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆవిర్భావం ఒక కీలకఘట్టం: ఈటల

చిక్కడపల్లి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావం ఒక కీలకఘట్టమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదర్శ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బీసీల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్లాది మంది ప్రజల కల అయిన ప్రత్యేక రాష్ట్ర సాధనలో అన్ని వర్గాలతోపాటు బీసీలు కూడా ఎంతో కృషి చేశారన్నారు. తెలంగాణలో బీసీలు బలపడాలంటే ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఎలా పోరాటం చేశారో బీసీలు కూడా రాజ్యాధికార సాధనలో అలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అధ్యక్షత వహించిన ఆదర్శ సంస్థ చైర్మన్ వంగాల బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో బీసీలను కలుపుకుపోతున్నామని తెలిపారు. బీసీల ఐక్యతకు ఒక బులెటిన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అశ్విని హెయిర్ ఆయిల్ అధినేత సుబ్బారావు, ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్‌పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌గౌడ్

వైన్‌షాపుల పర్మిట్ రూముల్లో 'ఫుడ్ సేఫ్టీ' తనిఖీలు నిర్వహించాలి

● తెలంగాణ రాష్ట్ర బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్

బర్కత్‌పుర, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్న వైన్‌షాపుల పర్మిట్ రూములల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హోటళ్లు, బార్లు, పబ్‌లలో ఫుడ్ ట్రేడ్ లైసెన్స్‌లతో తగు జాగ్రత్తలు తీసుకుని నాణ్యమైన ఆహారాన్ని సప్లయ్ చేస్తున్నామన్నారు. వైన్‌షాపుల పర్మిట్ రూమ్‌ల్లో అపరిశుభ్రత నెలకొంటుందని, కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారని ఆరోపించారు. పర్మిట్ రూమ్‌ల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు రైడ్స్ నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రమ్యకృష్ణ, రాజుగౌడ్, నర్సింహగౌడ్, వెంకన్నగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శులు పల్లె నర్సింహరావు, తిరుపతియ్య గౌడ్, మోహన్‌గౌడ్, అంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సబర్మతినగర్‌లో ఏఈ శ్యామ్‌సుందర్‌తో మాట్లాడుతున్న ముఠా జైసింహ

రిటైనింగ్‌వాల్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

చిక్కడపల్లి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ వాల్ పనులు త్వరగా పూర్తి చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నేత ముఠా జైసింహ అన్నారు. నాలా రిటైనింగ్ వాల్ పనులు పూర్తి అయితేనే నాలా వెంట ఉన్న బస్తీవాసులకు వరదనీటి సమస్య ఉండదని అన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు గురువారం జైసింహ బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్‌తో సబర్మతినగర్‌లో పర్యటించారు. బస్తీ అంతా అధికారితో కలిసి పర్యటించి గోడ నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు సత్యనారాయణ, శ్రీనివాస్‌గుప్తా, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం, డ్రగ్స్, పోర్న్ వీడియోలను నియంత్రించాలి: ఐద్వా

హైదరాబాద్ సిటీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం, డ్రగ్స్, పోర్న్ వీడియోలను ప్రభుత్వం తక్షణం నియంత్రించాలని, బెల్టు షాపులను మూసివేయాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.పద్మ, కె.నాగలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో గంజాయి, మద్యం మత్తులో మహిళలపై లైంగికదాడులు, హత్యలు తీవ్రంగా పెరుగుతున్నాయని, వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లోని తుకారాంగేట్‌లో నివసించే రోజా అనే మహిళను భర్త లక్ష్మణ్ తాగిన మైకంలో హతమార్చడం, మియాపూర్‌లో తండ్రియే కన్నకూతురుపై లైంగికదాడికి యత్నించి హత్య చేయడం, కరీంనగర్‌లో ఆరేళ్ల బాలికపై లైంగికదాడి చేసి చంపడం ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. భూపాలపల్లిలో మహిళా కానిస్టేబుల్‌పై ఎస్సై అత్యాచార సంఘటనను తీవ్రంగా ఖండించారు. తుకారంగేట్ ఘటనలో నిరుపేదలైన రోజా పిల్లలను ప్రభుత్వం ఆదుకొని వారి చదువుకు సాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.